క్లుప్తంగా

రూరల్‌లో ప్రతిఓటరుకూ ధన్యవాదాలు


ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధికి మద్దతు తెలిపిన ప్రతి ఓటరుకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రెండు నెలలుగా కష్టపడి పనిచేసిన ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త, అభిమానులు, స్నేహితులు, సానుభూతిపరులకు పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, నెల్లూరు నగరంలోని 26 డివిజన్ల ప్రజలు ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పాలనకు స్వచ్ఛందంగా మద్దతు పలికి ఓటు వేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

• ఊపిరి పీల్చుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ పటిష్టమైన చర్యలు చేపట్టారు. రెండు, మూడుచోట్ల చెదురు మదురు ఘటనలు మినహా ఎన్నికలు శాంతీయుత వాతావరణంలో జరిగాయి. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నారు. పటిష్ట భద్రతా ఏర్పాట్ల నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం రాత్రితో ముగిసినప్పటికీ పలు ప్రాంతాల్లో మంగళవారం వరకు అధికారులు బందోబస్తును కొనసాగించారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ‘శ్రీనేతాజి’ సత్తా

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వం విడుదల చేసిన ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారని శ్రీనేతాజి ఎంఎస్సార్ ప్రైవేట్ హైస్కూల్ అండ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ నేతాజి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక విజయమహల్ గేటు సమీపంలోని వారి పాఠశాలలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా నేతాజి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు షేక్.సాయికిరణ్ రాష్ట్ర స్థాయిలో 79వ ర్యాంకు, నరసింహ చాణక్య 358, వెంకట దిలీప్ 607, ఉమేష్ చంద్ర 636, వికాస్ 802 ర్యాంకులు సాధించారన్నారు. ఇలాగే రాష్ట్రస్థాయిలో పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు ఎంపికయ్యారన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ‘రెయిన్‌బో’ విజయభేరి


ప్రాప్తి జైన్‌కు అభినందనలు తెలుపుతున్న పాఠశాల యాజమాన్యం

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని కలివెలపాళెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారు. 13వ తేదీన సీబీఎస్ఈ ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రెయిన్‌బో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రెయిన్‌బో స్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రాప్తి జైన్ 495 మార్కులతో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దియా మెహత 484 మార్కులతో పాఠశాలలో ద్వితీయ స్థానం, కె.రిషికారెడ్డి 479 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పరీక్షలకు హాజరైన 97 మంది విద్యార్థులకు గానూ వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాలలో 32 మంది విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్‌లు అనిగోపకుమార్, అరునా స్వయంప్రభ, వైస్ ప్రిన్సిపల్ సురేఖరెడ్డి, పద్మజ పాల్గొన్నారు.

ఎన్నికల రాకపోకలకు తప్పని అవస్థ

సీతారామపురం: ఓటు వేయాలనే సంకల్పంతో వలస ఓటర్లు వందల కిలో మీటర్ల దూరం నుంచి గ్రామాలకు చేరుకున్నారు. బస్సుల్లో ఖాళీ లేకపోయినా అష్టకష్టాలు పడి స్వగ్రామాలకు వచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి ఓట్లు వేశారు. తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్య, ఉపాధి రీత్యా చెన్నై, పుణె, గోవా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉంటున్న వారందరూ ఆది, సోమవారాల్లో మండలానికి చేరుకున్నారు.

54వ డివిజన్‌లో ప్రగతి పుంతలు


నూతన తాగునీటి పైప్‌లైన్



అధునాతన వసతులతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్


నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం

• రూ.85 కోట్లతో అభివృద్ధి పనులు
• అన్నిరకాల మౌలిక వసతులు ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 54వ డివిజన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రగతి పుంతలు తొక్కాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన తరువాత రూ.85 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ చొరవతో ఈ డివిజన్‌లో పలు రకాల అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగింది. డివిజన్ పరిధిలోని జనార్దనరెడ్డి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, వెంకటేశ్వరపురం, ఇస్లాంపేట పరిసర ప్రాంతాల్లో రూ.85 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ఈ ప్రాంత రూపురేఖలే మారాయి.

• 14 సంవత్సరాలుగా భగత్‌సింగ్‌కాలనీలో ఉంటూ ఇళ్లు లేని 700 మందికి ఇళ్ల పట్టాల అందజేత.
• జనార్దనరెడ్డి కాలనీలో పిల్లలు ఆడుకునేందుకు, ప్రజలు వాకింగ్ చేసేందుకు పార్కును నిర్మించారు.
• వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీకి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్న దృష్ట్యా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీ వరకు నాలుగు లేన్ల సిమెంట్‌రోడ్డును నిర్మించారు.
• 30 సంవత్సరాలుగా జనార్దనరెడ్డికాలనీలో ఉన్న హిందూ శ్మశానవాటిక అన్యాక్రాంతం కాకుండా, శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు.
• నీటి సరఫరాను మెరుగు పరిచేందుకు తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టారు.
• విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా జగనన్న కాలనీలో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడంతో పాటు, జనార్దనరెడ్డి కాలనీ ఉన్న పాత విద్యుత్ సబ్‌స్టేషన్ స్థానంలో నూతన ఇండోర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు.
• వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ప్రధాన పాఠశాల, జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న ఉర్దూ పాఠశాల, భగత్‌సింగ్ కాలనీలోని పాఠశాలలకు ‘మనబడి నాడు-నేడు’ కింద అదనపు తరగతులు నిర్మించారు.
• జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించి అన్ని వసతులు ఏర్పాటు చేశారు.
• వెంకటేశ్వరపురం నుంచి పెన్నానదిలోకి వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మించిన ప్రధాన కాలువ వెంబడి ప్రమాదాలు జరుగుతుండడంతో కాలువ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు.
• 54వ డివిజన్‌లో నూతనంగా సిమెంట్ రోడ్లు, కాలువలు తదితర పలు అభివృద్ధి పనుల కోసం ఏకంగా రూ.85 కోట్లు ఖర్చు చేయడంతో 54వ డివిజన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయినట్లు తెలియజేశారు.

ఇల్లు ఇచ్చి ఆదుకున్నారు



“నాకు చిన్నతనంలో పోలియో వచ్చి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. నా భర్త మస్తాన్ రిక్షా తొక్కి కుటుంబాన్ని పోషిస్తుండేవారు. పదేళ్ల క్రితం ఆయన మృతిచెందాడు. ఇద్దరు పిల్లలు పెళ్లి చేసుకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం నేను ఒంటరిగా జీవిస్తున్నా. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా క్రమం తప్పకుండా ఇంటికి బియ్యంతో పాటు రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారు. నాకు సొంతిల్లు లేకపోవడంతో భగత్ సింగ్‌కాలనీలో చిన్న అద్దె ఇంట్లో ఉంటున్నా. నా పరిస్థితిని చూసి స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వలంటీర్‌తో చెప్పి జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేయించారు. జగనన్న పుణ్యమా అని నాకు సొంతిల్లు వచ్చింది. మాలాంటి వాళ్లకు జగన్ దేవుడు.

– జమీలమ్మ, దివ్యాంగురాలు,
భగత్‌సింగ్‌కాలనీ, నెల్లూరు నగర నియోజకవర్గం

ఇచ్చిన హామీ నెరవేర్చారు



భగత్‌సింగ్ కాలనీ ఏర్పడినప్పటి నుంచి 14 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోనే భర్త రసూల్‌తో కలిసి టీ అంగడి పెట్టుకుని జీవిస్తున్నాం. గతంలో అనేక సార్లు భగత్‌సింగ్‌కాలనీలో ఉంటున్న 700 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరాం. ఎన్నికల సమయంలో వచ్చి హామీ ఇచ్చారే తప్ప ఎవరూ మా గురించి పట్టించుకోలేదు. అయితే గత ఎన్నికల సమయంలో అనిల్‌కుమార్ యాదవ్ భగత్‌సింగ్‌కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన విధంగానే ఇళ్ల పట్టాలు ఇచ్చారు.

– కరీమా, టీ దుకాణం
నిర్వాహకురాలు, భగత్‌సింగ్‌కాలనీ


వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి జనార్దనరెడ్డికాలనీ వరకు వేసిన నూతన సిమెంట్ రోడ్డు


హిందూ శ్మశానవాటికకు నిర్మించిన ప్రహరీ

స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు


మాట్లాడుతున్న కలెక్టర్


సీల్ తీస్తున్న సిబ్బంది

• పటిష్ట బందోబస్తు ఏర్పాటు

నెల్లూరు(దర్గామిట్ట) : రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్‌రూమ్‌లో పటిష్ట బందోబస్తు మధ్య మంగళవారం భద్రపరిచారు. ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ ముగియడంతో కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, సర్వేపల్లి అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు పోలింగ మెటీరియల్‌ను కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు చేర్చగా, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు ప్రత్యేక కంటైనర్లలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేసి స్ట్రాంగ్‌రూంలో పటిష్ట బందోబస్తు మధ్య భద్రపరిచారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్ సోమవారం రాత్రి నుంచి మంగళవారం భద్రపరిచే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్ సింగ్ బధూరియా, కె జ్యోతితో పాటు కోవూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ ఆర్వోలు సేతు మాధవన్, విద్యాధరి, శీనానాయక్, మధులత, వికాస్ మర్మత్‌లతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఎలక్షన్ మెటీరియల్‌ను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచి సీల్ చేశారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లలో విద్యుత్ సరఫరాను కట్ చేశారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ లవన్న, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూమ్ బయట భద్రతా సిబ్బంది

మహిళలే నిర్ణేతలు


నగరంలోని మూలాపేట సోమవారం ప్రభుత్వ పాఠశాలలో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు

నెల్లూరు(బారకాసు) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నెల్లూరు నగరంలో అభ్యర్థుల గెలుపోటములు మహిళా ఓటర్లపైనే ఆధారపడి ఉంది. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో మొత్తం 2,39,497 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,71,763 ఓట్లు పోల్ కావడంతో 71.72 శాతం నమోదైంది. నగరంలోని సంతపేటలో ఉన్న సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 30వ నంబర్ బూత్‌లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో ఆ బూత్‌ను ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా పింక్ కలర్‌తో ముస్తాబు చేశారు. కాగా నగరంలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84,423 మంది పురుషులు ఓటు వేయగా, 87,314 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 26 మంది ఓటు వేశారు. సిటీ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో పురుషుల కంటే 2,891 మంది మహిళల ఓట్లు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే సిటీ ఎమ్మెల్యే భవితవ్యం మహిళలపైనే ఆధారపడి ఉందని తెలుస్తోంది.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీ నగర్‌లో ఉన్న వీర అభయాంజనేయ స్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం ప్రత్యేక పూజలు, పల్లకిసేవ గావించారు.

నెల్లూరుకు ఈవీఎంల తరలింపు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన 323 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ఈవీఎం బాక్సులను మంగళవారం సాయంత్రం ఉదయగిరిలోని స్ట్రాంగ్ రూము నుంచి నెల్లూరు ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. రాత్రి వరకు పలు మండలాల్లో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ తర్వాత ఉదయగిరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో వీటిని భద్రపరిచారు. అత్యంత భద్రతా దళాల పర్యవేక్షణలో ఈవీఎంలను తరలించారు.

పోలింగ్ సమయంలో అస్వస్థత

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెంలో 104, 105 పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం జరిగిన పోలింగ్ సమయంలో పలువురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు ఆరున్నర గంటలకే కేంద్రానికి చేరుకున్నారు. కేవలం పోలింగ్ బూత్‌ల ముందు మాత్రమే షామియానాలు ఏర్పాటు చేశారు. అయితే ఓటు పోల్ చేసేందుకు అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో ఎండలోనూ క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రెండు పోలింగ్ బూత్‌లు ఒకే చోట ఏర్పాటు చేయడం, అక్కడకు చేరుకునేందుకు ఇరుకైన మార్గం ఒక్కటే ఉండడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఓ దశలో అధికంగా ఓటర్లు చేరుకున్న క్రమంలో తీవ్ర వేసవి ఎండకు ఊపిరి ఆడక లైన్‌లో అక్కడక్కడ ఉన్న ఏడుగురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలోని వైద్య సిబ్బంది వారికి ప్రథమ చికిత్స అందించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలు మండల కేంద్రం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు అభిషేకాలు జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. ఉభయ కర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.